వ్యాయామశాల అభివృద్ధికి కృషిచేస్తా



మల్టీస్టేషన్ జిమ్ ఎక్విప్‌మెంట్‌ను ప్రారంభిస్తున్న బండా చంద్రారెడ్డి

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ మైలార్‌గడ్డలోని పురాతన మారుతి వ్యాయామశాలకు మల్టీస్టేషన్ ఎక్విప్‌మెంట్ పరికరాన్ని బీజేపీ సీనియర్ నాయకుడు బండా చంద్రారెడ్డి వితరణ చేశారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో మల్టీస్టేషన్ ఎక్విప్‌మెంట్‌ను బండా చంద్రారెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ఎనిమిది దశాబ్దాల క్రితం ఏర్పాటైన మారుతి వ్యాయామశాల జాతీయ స్థాయిలో ఎంతోమంది క్రీడాకారులను అందించిందని, వ్యాయామశాలను అన్నివిధాల అభివృద్ధి చేసేందుకు తనవంతు సాయంగా మల్టీస్టేషన్ ఎక్విప్‌మెంట్ పరికరాన్ని అందించానన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయామశాల డెవలప్‌మెంట్ కమిటీ ప్రతినిధులు నిర్మల్‌కుమార్‌గౌడ్, జలంధర్‌రెడ్డి, శ్రీనివాసగౌడ్, టీవీ శ్రీను, లంబుకుమార్, జాషు మోజెస్, శంకరరెడ్డి, బ్యాంకు రమేష్, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

ఆ మద్యం దుకాణాలను తొలగించాలి



వైన్‌షాపు ముందు ధర్నా చేస్తున్న కాలనీలవాసులు

రసూల్‌పురా: జనవాసాల మధ్య ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలు, పర్మిట్ రూమ్‌లను తొలగించాలని డిమాండ్ చేస్తూ కంటోన్మెంట్ తిరుమలగిరిలోని పలు కాలనీవాసులు వైన్‌షాపు ముందు ధర్నా నిర్వహించారు. తిరుమలగిరిలోని ఫుట్‌బాల్ మైదానం ఎదురుగా ఇండియన్ ఎయిర్‌లైన్స్ కాలనీ, పద్మానాభ కాలనీ, మలానీ కాలనీ, సూర్య ఎవెన్యూ కాలనీ వాసులు తమ కాలనీ వద్ద ఏర్పాటు చేసిన వైన్ షాపులు తొలగించాలని భారీ ఎత్తున ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కాలనీకి వచ్చే మార్గంలో వైన్ షాపు నిర్వాహకులు పోటాపోటీగా వైన్‌షాపులు పర్మిట్‌రూమ్‌లు ఏర్పాటు చేయడంతో అక్కడ తిష్ట వేస్తున్న మందుబాబులు అటుగా రాకపోకలు సాగించే మహిళల పట్ల దురుసుగా వ్యవహరిస్తున్నారని వెంటనే వైన్ షాపులను తొలగించాలని డిమాండ్ చేశారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ



పడిపూజలో పాల్గొన్న భక్తులు

సనత్‌నగర్: అయ్యప్ప నామ స్మరణతో సనత్‌నగర్ లింగయ్యనగర్ మార్మోగింది. గురుస్వామి తాళ్ల గౌతమ్‌గౌడ్ ఆధ్వర్యంలో పడిపూజ మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప పాటల గానామృతంతో భక్తులు భక్తి పారవశ్యంతో మునిగితేలారు. కార్యక్రమంలో వెల్లాల రామ్మోహన్, కొలను బాల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌లతో పాటు భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు.


అమరావతి విద్యాసంస్థలో క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

చిలకలగూడ : అమరావతి విద్యాసంస్థల ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సేవియర్ ఆర్మీ చర్చి ఫౌండర్ జోసెఫ్ డిసోజా, ప్రతినిధులు వనిత, ప్రేమ్, రోజ్, స్టీఫెన్ తదితరులు హాజరై ఏసు జననం, బోధనలను వివరించి విద్యార్థుల్లో అవగాహన కల్పించారు. విద్యార్థులు ఆలపించిన క్రిస్మస్ గీతాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. అన్నిమతాలు సమానమనే భావన విద్యార్థుల్లో కల్పించేందుకు, మత సామరస్యాన్ని పెంపొందించేందుకు అన్ని మతాలకు చెందిన పండుగలు, పర్వదినాలను ప్రతి ఏటా నిర్వహిస్తున్నామన్నారు. క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో అమరావతి విద్యాసంస్థల నిర్వాహకులు ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, వేంకటేశ్వరరెడ్డి, ప్రసన్నలక్ష్మీ, కవితారెడ్డి, వీణారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన వీరభద్ర స్వామి కల్యాణం



శివపార్వతుల వేషధారణలో భక్తులు



రసూల్‌పురా: సికింద్రాబాద్ జింఖానా మైదానంలో భద్రకాళీ సమేత వీరభద్ర ఆరాధ్య జనసేవా వాహిని ట్రస్ట్ ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న వీరభద్ర స్వామి కల్యాణం, వీధీ పళ్లెం మహోత్సవ వేడుకలు ముగిసాయి. ఆదివారం ఉదయం నుంచి మహాపూర్ణాహుతి, కలశోద్వాసన, 108 బాల వేద కుమారులచే వేదవాక్కుల వేద స్వస్తి, సహస్ర లింగార్చన చేశారు. వీరభద్రస్వామి, గణపతి వేషధారణలతో ఆకట్టుకున్నారు. తల, కనురెప్పలపై నూటికి జ్వాలా శూలాలు గుచ్చుకుని వీధీ పళ్లెం ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాశీనాధుని మల్లికార్జున శర్మ, తాడికొండ విజయ్‌కుమార్, ఇవటూరి కైలాష్, సుధాకర్ గుప్త, మడిపల్లి దక్షిణామూర్తి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

నత్తేనయం!

ఏడాదైనా పూర్తికాని గ్రంథాలయ భవనం నిర్మాణం



అసంపూర్తిగా గ్రంథాలయ భవనం నిర్మాణం

- మొండి గోడలతో దర్శనం
- పూర్తి చేయాలంటున్న స్థానికులు
- విస్మరిస్తున్న అధికారులు



పూర్తి నిర్మాణం ఐతే ఇలా (నమూనా చిత్రం)

లాలాపేట: హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో తార్నాక విజయపురికాలనీ మీ–సేవా వద్ద అద్దె భవనంలో కొనసాగుతున్న గ్రంథాలయానికి పక్కా భవనం నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతేడాది డిసెంబర్ 8, తార్నాక కమిటీ కాలనీలో 244 చదరపు గజాల ఖాళీ స్థలంలో రూ.80 లక్షల వ్యయంతో సొంత భవనం నిర్మాణానికి అప్పటి మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, మహమూద్ అలీ, ప్రస్తుత జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఏడాది క్రితం ప్రారంభం అయిన పనులు నేటికి ఒక్క అడుగు ముందుకు రెండడుగులు వెనక్కి అన్న చందంగా కొనసాగుతున్నాయి. జీప్లస్–1 భవన నిర్మాణంలో ఇప్పటి వరకు గ్రౌండ్ ఫ్లోర్ నిర్మాణం కూడా పూర్తి కాలేదు.

పోటీ పరీక్షలకు అనుగుణంగా అన్నారు..

ఈ భవనం శంకుస్థాపన సందర్భంగా అప్పటి ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో అనేక ఉద్యోగాల నోటిఫికేషన్లకు పోటీ పరీక్షలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులను దృష్టిలో ఉంచుకుని వారికి ఉపయోగపడేలా గ్రంథాలయాలను నిర్మాణం చేసి అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పిన మాటలు సంవత్సరం గడుస్తున్నా కార్యరూపం దాల్చలేదు. మరో వైపు ఇప్పటికే గ్రూప్–1 ప్రిలిమ్స్, గ్రూప్ –4, గురుకుల, వంటి పలు పోటీల పరీక్షలు ముగిసాయి. రానున్న రోజుల్లో గ్రూప్ 1, 2, 3, డీఎస్సీ వంటి ఉద్యోగ పోటీ పరీక్షలు జరుగనున్నాయి అప్పటి వరకైనా గ్రంథాలయ భవనం అందుబాటులోకి వస్తుందా అని స్థానిక నిరుద్యోగ యువత ఎదురు చూస్తున్నారు. ప్రజా ప్రతినిధుల మాటలకు, క్షేత్రస్థాయిలో జరుగుతున్న చేతలకు పొంతనే ఉండటం లేదని ప్రజల వాపోతున్నారు. గ్రంథాలయ భవన నిర్మాణం గుత్తేదారు నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తూ భవన నిర్మాణాన్ని కనీసం 50 శాతం పనులు సైతం పూర్తి చేయలేదు. మరో వైపు అద్దె భవనాల్లో కొనసాగుతున్న వాటికి అద్దెలు చెల్లిస్తూనే ఉన్నారు. అయినా అధికారులు విధుల పట్ల ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు అనే విమర్శలు ప్రజల నుంచి వెల్లువెత్తుతున్నాయి.

సీనియర్ సిటిజన్స్‌కూ సౌకర్యంగా..

తార్నాక ప్రాంతంలో నిర్మాణం చేస్తున్న గ్రంథాలయంలో అందుబాటులో వస్తే సీనియర్ సిటిజన్స్ అందరూ ఉదయం సాయంత్రం వేళలలో అక్కడ వార్తా పత్రికలు, పుస్తకాలతో కాలక్షేపం చేయడానికి వీలుటుందని తార్నాక ప్రాంతాల్లో సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ల వారు భావించారు. కానీ ఇంత కాలం గడుస్తున్నా ఇంకా మొండి గోడలతో భవన నిర్మాణం కనిపిస్తుండటంపై వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నూతనంగా ఏర్పడిన కొత్త ప్రభుత్వమైనా గ్రంథాయల భవనం నిర్మాణం పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని తార్నాక వాసులు కోరుతున్నారు.

బీఆర్‌జేసీ పాఠశాలలో సందడిగా 'ఫేట్'



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీనియర్ ట్రస్టీ నాదిర్ చినాయ్

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ పార్క్‌లేన్‌లోని బీఆర్‌జేసీ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది మధ్య సందడిగా ఫేట్‌ను నిర్వహించారు. ఆదివారం పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి సీనియర్ పాఠశాల ట్రస్టీ నాదిర్ చినాయ్ హాజరై మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారిలో మరింత ఉత్సాహం, ఉల్లాసాన్ని నింపేందుకు ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఫేట్‌ను ప్రతి నాలుగేళ్లకోసారి జరుపుతామన్నారు. పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు ట్రస్టు ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని, ఎలాంటి లాభాపేక్ష లేకుండా ఉత్తమ విలువలతో బోధన అందిస్తామన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ విష్ణువర్ధనాచారి మాట్లాడుతూ.. పాఠశాలలో వెయ్యి మంది విద్యార్థులు చదువుతున్నారని ఇందులో పేద విద్యార్థులు ఉన్నారని వారికి తగిన స్కాలర్ షిప్‌లు అందిస్తూ ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ప్రతి ఏడాది స్కాలర్‌షిప్‌ల ద్వారా రూ.15 లక్షలు కేటాయిస్తాయించడంతో పాటు ఫేట్ లాంటి వాటితో వచ్చే ఆదాయాన్ని కూడా ఇందుకు వినియోగిస్తామని వివరించారు. ప్రభుత్వ సహకారం లేకుండా మేనేజ్‌మెంట్ విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించే ఏకైక ప్రైవేటు విద్యా సంస్థ తమదే అన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌వో సత్యనారాయణ, రత్నాకర్, అనహిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆక్యుపంక్చర్ వైద్య శిబిరం



బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ పద్మారావునగర్ పార్కులో ఆదివారం ఆక్యుపంక్చర్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆక్యుపంక్చర్ సురేఖ పలువురు రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందించి ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవాలని అనే విషయాలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సురేఖ మాట్లాడుతూ.. ఆక్యుపంక్చర్ అనేది శరీరం యొక్క సహజ ప్రతి స్పందనను ప్రేరేపించడం ద్వారా పని చేస్తుందన్నారు. శరీరం యొక్క సమతుల్యతను పునరుద్ధరిస్తుందన్నారు. మానవ శరీరంలో అన్ని అవయవాలు చక్కగా పని చేస్తున్నప్పుడు మనిషి ఆరోగ్యం, ప్రశాంతంగా జీవిస్తాడన్నారు. అన్ని రకాల వ్యాధులను ఆక్యుపంక్చర్ వైద్య విధానం ద్వారా నయం చేస్తామని వివరించారు. ఎలాంటి వైద్య పరీక్షలు, నివేదికలు లేకుండా తక్కువ ఖర్చుతో రోగాలను నయం చేసుకోడానికి వీలుందన్నారు. ఆక్యుపంక్చర్ విధానంలో మందులు, సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా చికిత్సలు అందజేస్తామన్నారు. వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు నిరంజన్‌రావు, సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాస్, రవికుమార్, గిరి, రాము, బాలు పాల్గొన్నారు.

కృత్రిమ చేతుల అందజేత



కృత్రిమ చేతిని అమర్చుతున్న దృశ్యం

రాంగోపాల్‌పేట్: పుట్టుక, వివిధ కారణాలతో చేతులను పోగొట్టుకున్న వారికి రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్, పుణెకు చెందిన ఇనాలి ఫౌండేషన్, శ్రీరాం యూనివర్సల్ స్కూల్ టీచర్స్ సహకారంతో కృత్రిమ చేతులను పంపిణీ చేశారు. ఆదివారం సికింద్రాబాద్ ప్యాట్నీ సెంటర్‌లోని మహబూబ్ కాలేజీలో జరిగిన ఈ కార్యక్రమానికి రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఒరిస్సా, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు వచ్చారు. బ్యాటరీతో నడిచే ఈ ఆధునికమైన కృత్రిమ చేతులతో రాయడం, తినడం, డ్రైవింగ్ చేయడం లాంటి పనులను అవలీలగా చేసుకోవచ్చని..గతంలో కూడా తాము అనేక మందికి ఇలాంటి కృత్రిమ చేతులను అమర్చినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమం సోమవారం కూడా కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షురాలు జ్యోతిరెడ్డి, కార్యదర్శి వజ్రాల రాజగోపాల్, డిస్ట్రిక్ట్ సహాయ గవర్నర్ సురేష్ గుప్తా, డైరెక్టర్లు శ్రీదేవి, లక్ష్మి, విసిరెడ్డి, రిజ్వాన్, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా



ఎమ్మెల్యేను కలిసిన అసోసియేషన్ సభ్యులు

సనత్‌నగర్: నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించడమే తన ప్రధాన ఎజెండా అని సనత్‌నగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మూడోసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయనను మోడల్‌కాలనీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సనత్‌నగర్ నియోజకవర్గ ప్రజలకు తాను ఎల్లవేళలా రుణపడి ఉంటానన్నారు. వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ ముందుకుసాగడం వల్లనే ప్రజలు తనను మూడోసారి ఆదరించారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి జరిగేలా చూస్తానన్నారు. జీఎస్‌టీ శాయి, సుబ్బారెడ్డి, వెంకటేశ్వరశర్మ, నాగమణి ఎమ్మెల్యేను కలిశారు.

ఆకట్టుకున్న సిక్కుల విన్యాసాలు





చిలకలగూడ : సిక్కు మత గురువు తేజ్ బహుదూర్ సాహెబ్ 348వ బలిదాన దినోత్సవ వేడుకలు సీతాఫల్‌మండి గురుద్వారా ప్రబంధక్ కమిటీ నేతృత్వంలో చిలకలగూడ మున్సిపల్ మైదానంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమృత్‌సర్‌కు చెందిన పలువురు ఆధ్యాత్మికవేత్తలు ఆలపించిన విశాల్ కీర్తన దర్బార్, నగర సంకీర్తన, విన్యాసాలు ఆహుతులను ఎంతగానో అలరించాయి. గురు కా లాంగర్ పేరిట అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నగరం నలుమూలల నుంచి సిక్కు మతస్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ప్రబంధక్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ప్రతాప్‌సింగ్, జస్వీందర్‌సింగ్‌లు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.21, నల్లవంకాయ 45, పొడుగు వంకాయ 45, బెండకాయ 55, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 55, పచ్చకాకర 55, పందిరి బీర 60, క్యాబేజీ 15, క్యారెట్ 28, దొండ 60, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 70, గోకరకాయ 50, కీర 23, దోసకాయ 28, బీట్‌రూట్ 28, ఉల్లిగడ్డ 25, ఆలుగడ్డ 23, చామగడ్డ 45, మొరంగడ్డ 23, కందగడ్డ 45, సొరకాయ 15, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4–6, ముల్లంగి 4–6. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల˘రకు అమలులో ఉంటాయి.

సీపీకి జ్ఞాపిక బహూకరణ



సీపీకి జ్ఞాపిక అందజేస్తున్న వీసీ, రిజిస్ట్రార్

ఉస్మానియా యూనివర్సిటీ: నగర పోలీస్ కమిషనర్ (సీపీ) కొత్తకోట శ్రీనివాసరెడ్డికి ఓయూ వీసీ ప్రొ.రవీందర్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ ఆర్ట్స్ కాలేజీ జ్ఞాపికను బహూకరించారు. నిజాం కాలేజీకి చెందిన ఓయూ పూర్వ విద్యార్థి సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం ఓయూలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ఇతర అంశాలపై చర్చించినట్లు అధికారులు తెలిపారు.

మహిళపై గ్యాంగ్ రేప్

ఐదుగురి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న ఈస్ట్‌జోన్ డీసీపీ సునీల్ దత్

అడ్డగుట్ట: ఓ మహిళపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఐదుగురిని రిమాండ్‌కు తరలించిన ఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆదివారం లాలాగూడ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈస్ట్‌జోన్ డీసీపీ సునీల్ దత్ వివరాలు వెల్లడించారు. ప్రశాంత్‌నగర్‌కు చెందిన భర్న యేసు (32) మెకానిక్. ఈ నెల 7న అర్ధరాత్రి భర్న యేసు తన హోండా యాక్టివాపై తార్నాక మీదుగా ప్రశాంత్ నగర్‌కు వెళ్తున్నాడు. రోడ్డు పక్కనే ఓ మహిళ బస్సుకోసం ఎదురుచూస్తుంది. అదే మార్గంలో వెళ్తున్న యేసు సదరు మహిళను లాలాపేటలో డ్రాప్ చేస్తానని బైక్ ఎక్కించుకున్నాడు. మాయమాటలతో సదరు మహిళను తప్పుదోవ పట్టించి ప్రశాంత్‌నగర్ రైల్వే క్వార్టర్స్‌లోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లాడు. అనంతరం తన స్నేహితుడు సీత మధుయాదవ్(31)ను పిలిపించి ఇద్దరు కలిసి ఆ మహిళపై అత్యాచారం చేశారు. ఆ తర్వాత మరో ముగ్గురు స్నేహితులు శ్రీగిరి ప్రశాంత్ కుమార్(20), తరుణ్‌కుమార్ (20), కేషోజువ రోహిత్(19)ను పిలిపించి ఐదుగురు కలిసి సామూహికంగా లైంగిక దాడికి పాల్పడ్డారు. అనంతరం బాధితురాలిని మధుయాదవ్ తార్నాకలో వదిలేసి పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా ఐదుగురిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఏసీపీ జైపాల్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ మధులత, డీఐ ప్రభాకర్, ఎస్ఐలు షాహీద్‌పాషా, నాగారాజ్ పాల్గొన్నారు.

జెక్‌కాలనీ ఫెడరేషన్ పూర్తిస్థాయి కమిటీ ఎన్నిక



నూతన కమిటీని అభినందిస్తున్న సూర్యశంకర్‌రెడ్డి, సుబ్బరాజు

సనత్‌నగర్: జెక్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ పూర్తిస్థాయి కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మల్లు ప్రసాద్, కోశాధికారిగా శివారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే. అలాగే ఉపాధ్యక్ష పదవికి నలుగురు, ప్రధాన కార్యదర్శిగా ఒకరు, సంయుక్త కార్యదర్శులుగా నలుగురిని ఈసీ సభ్యులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన కమిటీని ఎన్నికల అధికారిగా వ్యవహరించిన హరిప్రసాదరావు ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా ఎన్.శశికళ, రామసుబ్బారెడ్డి, శ్రీనివాసరెడ్డి, నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రాజశేఖర్ చందు, సంయుక్త కార్యదర్శులుగా రమణమూర్తి, భాస్కర్‌రావు, సుదర్శన్‌రావు, లక్ష్మారెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను ఫెడరేషన్ మాజీ అధ్యక్షులు జి.సూర్యశంకర్‌రెడ్డి, గ్రీన్‌సిటీ అధినేత కొండ్రాజు సుబ్బరాజు, అనంతరెడ్డి అభినందించారు.

కాంగ్రెస్‌లో చేరిక



అంజన్‌కుమార్‌యాదవ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

సికింద్రాబాద్: ఎన్నికలకు ముందే కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి చేరిన నాయకులు మళ్లీ కాంగ్రెస్ గూటికి చేరారు. సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన ఏ బ్లాక్, బీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు జగదీశ్వర్, సురేశ్‌లాల్ ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ జగదీశ్వర్, సురేశ్‌లాల్‌తోపాటు పలువురు నాయకులకు కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నారు. ఈ సందర్భంగా ఇరువురు నాయకులు మాట్లాడుతూ.. తాము మొదటి నుంచి కాంగ్రెస్ వాదులమేనని, సికింద్రాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసే విషయంలో తమ అభిప్రాయాన్ని పరిగణలోనికి తీసుకోలేదన్న కారణంతోనే తాము నెల రోజుల క్రితం బీఆర్ఎస్‌లో చేరినట్టు చెప్పారు. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి ఓటమి పాలైనప్పటికీ పార్టీని పటిష్టం చేయడంతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేందుకు కృషి చేస్తామన్నారు. ఏ,బీ బ్లాక్ అధ్యక్షులతో పాటు జహంగీర్, రాజశేఖర్‌రెడ్డి, సాయి, ప్రణయ్, సందీప్‌కుమార్, అఖిల్, రాజేశ్, రాము కాంగ్రెస్‌లో చేరారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ ఉత్సవాలు



రాజేశ్వర్‌రావును సత్కరిస్తున్న దృశ్యం

రాంగోపాల్‌పేట్: యేసు పాటలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, క్రీస్తు సందేశాలతో 45వ యునైటెట్ క్రిస్మస్ ఉత్సవాలను సికింద్రాబాద్‌లోని హరిహరకళాభవన్‌లో ఘనంగా నిర్వహించారు. యూసీసీ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాల్లో నగరానికి చెందిన వందలాది మంది క్రైస్తవులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ చర్చిలకు చెందిన క్రైస్తవ యువత క్యారల్స్‌లో ఆలపించిన మధురమైన యేసు క్రీస్తు పాటలు మనసును హత్తుకున్నాయి. అలాగే క్రీస్తు జనన వృత్తాంతాలను నాటిక రూపకంగా ప్రదర్శించి ఆకట్టుకున్నారు. అలాగే ప్రముఖ క్రైస్తవ మత బోధకులు పాస్టర్ శ్యాం అబ్రహం దైవ సందేశాన్ని అందించారు. ఈ ఏడాది యూసీసీ ఆధ్వర్యంలో చారిటీ, మెడికల్ క్యాంపులు, పాటల పోటీలు తదితర కార్యక్రమాలను నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు, అదనపు డీసీపీ శ్యాంబాబు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సువర్ణరావు, ఈగర్‌పాల్, ప్రదీప్, ఉపాధ్యక్షులు కరుణాకర్, ప్రశాంత్, మోజెస్ పాల్ పాల్గొన్నారు.

వేధిస్తున్నారంటూ భర్త ఇంటి ముందు ధర్నా



తల్లి కుమార్తెతో కలిసి భర్త ఇంటి ముందు బైఠాయించిన పవిత్ర

సికింద్రాబాద్: తనది ప్రభుత్వ ఉద్యోగం అంటూ నమ్మించి వివాహం చేసుకోవడమే కాకుండా తనను వేధింపులకు గురిచేస్తున్నాడంటూ భర్త ఇంటి ముందు భార్య బైఠాయించిన ఉదంతమిది. సికింద్రాబాద్ బౌద్ధనగర్ డివిజన్ పార్సిగుట్టకు చెందిన విశ్రాంత ఉద్యోగి రాంచందర్‌రావు తనయుడు కార్తీక్‌చంద్రతో చంపాపేట్ తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తున్న పవిత్రతో 2015లో వివాహం జరిగింది. అప్పట్లో రూ.10 లక్షల కట్నం, 40 తులాల బంగారం, 2 కిలోల వెండి ఇచ్చి తమ కుటుంబ భ్యులు వివాహం జరిపించినట్లు పవిత్ర తెలిపారు. వివాహం జరిగిన కొన్ని రోజులకే తన భర్తకు ప్రభుత్వ ఉద్యోగం లేదని తెలిసిందని అయినప్పటికీ సర్దుకుపోతున్నా తన పట్ల భర్తతోపాటు అత్తింటివారు గృహహింసకు పాల్పడుతున్నట్టు ఆమె తెలిపారు. అదనపు కట్నం కావాలని రోజూ వేధిస్తున్నారని తనకు న్యాయం జరిగే వరకు ఇక్కడే కూర్చుంటానని తన కుమార్తె, తల్లితో పార్సిగుట్టలోని తన భర్త ఇంటి ముందు బైఠాయించింది. విషయం తెలుసుకున్న వారాసీగూడ పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

రాంగోపాల్‌పేట్: ఫుట్‌పాత్‌పై పడివున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గోపాలపురం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఆదివారం సాయంత్రం చిలకలగూడ చౌరస్తాలోని మెట్రో పిల్లర్ నంబర్ 1150 వద్ద గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు సమాచారం మేరకు వెళ్లిన పోలీసులు వివరాలు సేకరించారు. మృతుడికి 55– 60 వయస్సు ఉంటుందని ఒంటిపై ఆకుపచ్చ రంగు టీ షర్ట్, బ్రౌన్ కలర్ ప్యాంటు ధరించి ఉన్నట్లు తెలిపారు. మృతుడి దగ్గర ఎలాంటి ఆధారాలు లభించలేదని స్థానికులను విచారించగా ఇదే ప్రాంతంలో యాచిస్తూ జీవనం సాగిస్తుంటాడని తెలిపారు.